# * గులాబి *

బి. ఏ. ఆనర్స్ ప్యాసయి యేంచేద్దామనే ఆలోచన లో పడ్డరోజులవి. ఆ ఆలోచనలమధ్య యేదోఒక అమ్మాయి అందచందాలు నడనడికకుకూడా స్థానంవుండేది. నేనో అందగాడివనే సంతృప్తి ఎల్లప్పుడూ నన్నుఅంటిపెట్టుకొనివుండేది. మాఅమ్మమ్మ 'ఈ డొప్పచెవులవాడికి కోతిలాంటి పెళ్ళాం వస్తుందని' అనేప్పుడు మాఅమ్మ 'ఆచెవులుతప్ప యింకేం యెంచటానికి దొరకలేదా?' అనేది. ఆమధ్య ఒక మిత్రుడు 'నువ్వొక సినిమాలో హీరో కాకపోయినా నీ ముఖంలో అదొక విధమైన ఆకర్షణపై వాళ్ళ హృదయాల్ని దోచుకుంటుందన్నాడు.

సాధారణంగా ఆవయసులో పికపికలాడే ప్రతి మనిషిలోవుండే ఆలోచనలూ కోరికలూ, నాలోనూ వుండేవి. భవిష్యత్తు గురించి కలలుకనటం నేర్చుకొనే ఆరోజుల్లో మా నాన్నకు జబ్బుచేసింది. కావలసిన మందులుదగ్గరగాదొరక్క పోవటంచేత 48 మైళ్ళ దూరంలో వున్న పట్టణానికివెళ్ళాను. మందులు కొనేసరికి సాయంత్రం ఐదున్నరఅయింది. మెయిన్

రోడ్డుమీద ఒక మిత్రుడు కలిసి 'చలపతి ఫలానా వార్డులో వున్నాడ'ని బెడ్ నెంబరు వివరాలన్నీ యిచ్చాడు. 'యూనివర్సిటీ' హాస్టల్లో నేనూ, చలపతీ, ఒకగదిలో వుండేవాళ్ళం. స్నేహం నన్ను వెంటనే చూడకుండా వెళ్ళనివ్వలేదు కాదు. అదీకాకుండా నేను తిరిగి వెళ్ళటానికి యేబస్సూ, రైలూ లేదు.

ఆసుపత్రిలో చలపతిని కలిశాను. వాణ్ణి విడిపోయి కొన్నినెలలయినా, ఎన్నో సంవత్సరాల్లా అనిపించింది. వాడికి చెప్పటానికి మెన్నెన్నోనాకబుర్లున్నాయ్, నాకు వాడు చెప్పగలిగినదంతా వినేద్దామనే వుబలాటం హెచ్చవుతున్న కొద్దీ. వార్డులో చాలా గొడవ జరుగుతూంది. ఆ నర్సువేపు చూసి విసుక్కునేవాళ్ళు, గొణుక్కుంటూ, స్వజనాన్ని విడిచి వెళ్ళటానికి మనస్కరించకపోయినా, వెళ్ళకవిధి లేక కదిలే వాళ్ళ పరిస్థితి ఒక కంట చూస్తూనే వున్నాను.

ఆరుగంటలవటంతో అసలు ఈగలభా జరిగింది! ఆమె అంత పొట్టికాదు; పొడగరీకాదు. శరీరం బంగారు ఛాయ. ముఖంలో కనీ కనిపించని రంగుబొట్టు పెట్టింది. చిన్నకాటుక రేఖ దిద్దినట్లున్న విశాలమైన నేత్రాలు. సన్నని నడుంపైగా వున్న వళ్ళుపొందిక. నేను చలపతిమాటలువింటున్నా ఆమె వైపు దృష్టి పోనివ్వకుండా వుండలేకపోయాను, యీమె యీగౌనుతోనే యిలావుంది- ఒకనల్లటిచీర తెల్లటిబ్లౌజుతో వుంటే-నాశరీరమంతా వూహించి- మరీ పులకరించింది.

ఆరుగంటల పదినిముషాలయ్యింది. నేను, రోగులూ

తప్పించి మిగతావారందరూ కదలిపోయారు. రెండుసార్లునా దరిదాపులోనికి ముఖం చిట్లించుకొని వచ్చింది. ఆచిట్లింపులో ఆమెఅందాన్ని రెట్టించుకొన్నట్లనిపించింది. యింకేవిషయం నేనాలోచించలేదు, ఆచిరాకుతో ఆమె వరండాలోవున్న రోగులతో, బాతాకానీకి దిగి పనిచెయ్యని వార్డుబోయ్ మీద విరుచుకుపడుతూ, వార్డు ఆఫీసుగదిలోకివెళ్ళిపోతుంటే వెక్కిరిస్తూ వార్డుబోయ్ 'సుందరీ— నీకెందరో' అని గొణుక్కోవటం దగ్గరగావున్న నేను విన్నాను. లోనుంచేవరండా వేపు చూశాను. రోగులు సహితం ఆమె అవినీతిని, పరిహసించే నవ్వును వెళ్ళబోసుకొన్నారు. మాచలపతి ఆమె విషయం యెత్తకండా వుండలేకపోయాడు.

'ఎలా కొరకొర లాడుతోందో చూశావా! దీని సంగతి నీకు తెలియదులే. వారంరోజులబట్టిచూస్తున్నానుగా'

నాకూ ఆమెవిషయంయింకా తెలుసుకోవాలనివుంది. 'ఊ' కొట్టున్నాను.

'ఇది కథలావుంది. నే నమ్మనంటావులే! నలుగురూ నమ్మలేని కొన్ని విషయాలు లోకంలో నిజంగా జరుగుతా' యన్నాడు—

ఆమె ఆంతలో మళ్ళీవచ్చి చలపతి మంచం దగ్గరకు వస్తూ నావైపు ఒకసారిచూసి 'పల్లెటూరి వాళ్లు కారుగా— ఒకసారి చెప్తేవినాలి!' ఈమాటలు అని ఆమె వరండాలోనికి వెళ్లి ఒకరోగి సేవలో నిమగ్న మయింది. చలపతిముసిముసి

నవ్వులు వెళ్ళబోసి 'ఒరే నీమీద కన్నుపడిందిరా' అన్నాడు నాకు మాటలు రావటంలేదు.

'ఆమెనిచూసి చలించని మగాడు లేడు. యిలాంటి అలాంటిమగాడ్ని ఆమెవిడిచిపెట్టనూ విడిచిపెట్టదు. పోనిద్దూ దానిదీఒక బ్రతుకేనా' అని చివరకు తేల్చాడు.

నాకు అక్కడనుండి కదిలిపోవాలనిపించింది. ఆమెకు అనవసరంగా, నావిషయంలో, కోపం తెప్పించటం భావ్యం కాదనిపించింది. ఎందరో లోకంలో యే ప్రత్యేకతా లేని వాళ్లుంటారు. పుట్టారు. మామూలుగా బ్రతుకుతారు. చచ్చిపోతారు. యేదో ప్రత్యేకత వున్నవాళ్ళనియెలాగౌరవిస్తామో అలానే యీమెను గౌరవించాలనిపించింది. ఆమెలో అప్పటికి నాకు కనిపించిన ప్రత్యేకత ఆమె అందమే.

వెళ్లిపోతానంటే నేను పల్లెటూరివాడ్ననని నిరూపించాలని చలపతి పట్టుపట్టి నన్నాపేశాడు. ఆమె రోగుల సేవ చేస్తూనే నావైపు చూస్తోంది. కొరకొరా చూస్తూందనుకున్నాను. చివరకు చలపతి దగ్గరకువచ్చి కుశలప్రశ్నలు వేస్తూ నావేపు చూసింది. నాబెదురుచూపులు ఆమె జాలికి పాత్రమయ్యాయేమో 'రండి!' అంది. నేనుయేప్రశ్నా వెయ్యకండా వెంట పడదామనుకుంటుంటే "చాలాభయస్తుడు' అని చలపతి అందుకున్నాడు.

'ఆయనభయంతో నాకేం పనిలేదు. ఇక్కడ ఆరు గంటలయ్యాక పైవాళ్ళెవరూ వుండటానికి వీల్లేదు!'

'వాడు వచ్చేసరికే ఆరుగంటలయ్యింది చాలాకాలానికి కలుసుకొన్నాం. మీరిలా అడ్డుపెడితే యెలాచెప్పండి!' చలపతి మాట్లాడుతున్నంతసేపూ నావైపు చూసీచూడని చూపులు విసురుతోంది.

'అలా అయితే పర్మిషన్ తీసుకోండి' అంది.

'మీరే యివ్వండి. వెళ్ళరా!' అన్నాడు చలపతి. నేను ఆమె వెనకాలే నడిచి, వార్డులోని ఆఫీసు గదిలోనికి వెళ్ళాను. గదిలో ఒకటేబిలు—రెండువైపులా రెండుకుర్చీలు ఉన్నాయి లైటు చాలా తక్కువ వాల్టుసదిలావుంది ఆకుపచ్చని దళసరి డోర్ కర్టన్ , విండోకర్టన్సు చుట్టూ కనిపిస్తున్నయ్. ఆమెకూర్చుంది. నన్నుకూర్చోమని సైగచేస్తోంది. చేతిలో కలంపట్టుకొని, యెదరగా, ఒంటరిగా, శాంతంగా, ప్రశాంతతలో, ఆనిదానమైన నిండుచూపు, తళుక్ తళుక్ మని మెరుపుతీగెలా నామీద పడ్తుంటే, ఏంటో నా నోటిలో ఒక్కొక్కపట్టు తేనెబొట్లురాలుతున్నట్లనిపించింది. ఆమె చటుక్కున ఆకాగితాన్ని నాచేతికిచ్చి చెయ్యి పట్టుకుంటూ నా వైపువచ్చేసింది. నా శరీరం స్వాధీనంలో లేదు. నన్ను నేను మరచిపోయేను. నేను ఒక ప్రఖ్యాత రచయిత రాసిన కథల్లోనిహీరోగా మారిపోతున్నట్లనిపించింది. ఆమెను నే నేమైనా చేసేగలను. కానీ ఏమీ చేయలేకపోయాను. నాముఖం దగ్గర పెట్టిన ఆమెముఖాన్ని ఒకసారి నా కుడిచేతితో తాకి విడిచిపెట్టి గబగబ గది బయటకు వచ్చే

శాను. గజగజ వణికిపోతూన్న నేను తిరిగిచూసి మళ్ళీవె ళ్దామనుకుంటూనే ముందుకు నడుస్తూన్నాను. చలపతి మంచందాటి యింకాసాగి పోతూంటే "యిచ్చిందిరా!" అన్నాడు. ఆగాను. నావింతచూపు యిచ్చింది అనేసంజ్ఞా సమాధానం చూసినచలపతి చిన్న నవ్వునవ్వేడు.

"వస్తాను" అన్నాను.

"పెర్మిట్టు దేనికి?" అన్నాడు.

'మళ్ళీకలుస్తాలే! నాకుటైమయిందని!" గబగబకదిలిపో యాను. ఆమెఅంతవరకు గదిబయటకు రాలేదు. అలావెళ్ళి పోతూనే గదివైపుకుచూశాను. ఆమెపాదాలైనా అగపడ లేదు. రోడ్డుమీద పడి నడుస్తూన్నాను—ఓ కుంటివాడిలా! నేనామెకోసం పరితపించి, పలవరించి, చివరకు కలుసుకొని, నాకు ఆమెకు పరిచయ మేర్పడి, నాదానిగా చేసుకొని, ఆమెమీద అలకసాగించి, ఆమెనువిడిచిపెట్టి ఏదూరదేశాల కో మళ్ళీతిరిగిరాకుండా వెళ్ళిపోతున్నా ననుకున్నాను. నా మనోదౌర్బల్యం నాముఖాన్ని మళ్ళీ ఆమెకు చూపడానికి, మరికొన్ని పాళ్లుహెచ్చుగా దుర్బలమైంది. నన్ను ఒక మగ వాడిలా ఆమెచూడదు — నాగురించి ఆమెకు ఒక విధమైన జుగుప్స జనిస్తుంది. నేనంటే ఆమెవిసుక్కుంటుంది. వెక్కిరి స్తుంది—పకపకా పరిహాసం చేసి నవ్వుతుంది — నే నింట్లో వున్నా నే నెవ్వో అనుకున్నాను. నేను ఆమెను యింకేదే దోచేసీయవలసిందని, చేసినట్లు తల్చుకొని, కలలుగన్న రోజు

లుగూడా లేకపోలేదు. ఇలాంటిఅవకాశం యెందరు యువకు లకువస్తుంది. వచ్చే అవకాశాన్ని చేతులావదులు కున్నాను. ఆమెను యేమీ చెయ్యలేకపోయేను తలచుకొన్న కొద్దీ నా ఆలోచనలకు తెంపులేదు. ఒక గమ్యం లేదు— మళ్ళీ వెళ్దా మని అనుకొన్నాను. వెళ్ళినా మళ్ళీ అలాంటి అవకాశం రాదని, మరింత నవ్వులపాలు కావటం తప్పించి, ఇంకేమీ కాదని, యీ అనుభూతిని, సజీవం చేసుకొంటూ కొన్నాళ్లు యింట్లోనే వున్నాను.

ఉద్యోగం దొరికింది. తలలో యీ ఆలోచనలు విధి లేక తగ్గించే పరిస్థితి వస్తోంది. రోజుకురోజూ వాటికి జీవం పోసే నా శక్తి సన్నగిల్లుతోంది. కొత్తఆలోచనలూ అను భూతులు తొలిసారి నాకు కాబోయే, భార్యనుచూశాక కలి గాయి. ఆవేళనుంచీ ఆమె యిదివరకు ఆక్రమించుకున్న స్థలాన్ని బలవంతాన తీసుకున్నట్లనిపించింది. ఒక్కొక్కసారి నాకు ఆమెను యెలా మర్చిపోవటమనే వుబలాటకొట్లాడేది. కానీ కాలం నాలో మార్పును తీసుకవచ్చింది. నాకు పెళ్ళికా వటం, నాభార్యలో నాక్కావలసినవన్నీ దొరకటం, రాను రాను నామనస్సునుంచి ఆమెను పూర్తిగా తుడిచివేశాను. ఆమె యిప్పుడు నాదికాదు. నాది నాభార్య! ఆమె ఎవరో యిప్పుడు! ఒక ఆసుపత్రిలో నర్సు. ఆ వేళ ఆ సంఘటన సరిగా యిప్పుడు జ్ఞాపకం లేదు. అంతకంటే నాభార్యరోజుకు రోజు మరిచిపోలేని సంఘటనలతో నెత్రెత్తిస్తోంది. మాది ఒక అన్యోన్యమైన జంట అని నలుగురూచెప్పుకుంటున్నారు

ఆమధ్య నేనొకసారి ఆసుపత్రికి ఒక మిత్రుణ్ణి చూడడానికి వెళ్ళవలసి వచ్చింది. ఎందర్లో నర్సులు కనిపించారు. ఈ నర్సు జ్ఞాపకం వచ్చింది. ఆమె కనిపించాలని నేను కోరలేదు. ఆదృష్టితో యీ నర్సులవేపు చూడలేదు. వాళ్ళు గుంపులు గుంపులుగా పోతూ కిలకిలా నవ్వుకుంటున్నారు. బహుశా నాలాంటివాళ్ళు చూడాలనేమో మరీయిదిగా అయిపోతు న్నారు. ఆ త్రోవపోతూ యింకో కుర్రవాడు — మీసంలో రెండేరెండు పండు వెం టుకలుండిపోయాయ్. ఏకో వాళ్ళ గురించే గొణుక్కుంటున్నాడు. ఒక గృహిణి వాళ్ళవేపు మరీ విచిత్రంగా చూస్తోంది. కళ్ళద్దాల కంపౌండరు కిటికీ సందులోంచి చూస్తూచూస్తూ 'ఛా' అనుకున్నాడు. ఒక మేల్ నర్సు ఒకావిడవేపు చూసి నవ్వాడు. కొందరు స్టూడెంట్సు వెంటనేవెళ్తూ వెనకయెవరైనావస్తున్నారేమో అని చూస్తున్నారు. కాబూలీవాలా యీలోకంతో నాకు సంబంధం లేదని వెళ్ళిపోతున్నాడు. నేనుమాత్రం వాళ్ళను అసహ్యించుకొంటూ వెళ్ళిపోతున్నాను.

త్రోవలో నాకో ఆలోచన తట్టింది. నైతికవిలువల యందు యిప్పుడు నే నేర్పరుచుకొన్న ధృఢమైన నమ్మకం, నే నంతగా ఆ నర్సుగురించి, మొంనుకలాంఆరోజుల్లో అయి పోయాననిపించింది. ఆమెను గౌరవించటానికి ఆమెలో యే ప్రత్యేకతాలేదు. అందం ఒక ప్రత్యేకతకాదు. అదికాలం మొదట క్రుంగిపోతుంది. నైతిక విలువలకు కాలంయింకేదీ— యేమీ చెయ్యలేదు. యివి కాలాన్ని కాలుతో తన్నుతాయి నాభార్యలోని నైతిక విలువలు—ఆమెలోనిఅవినీతి—రెండూ

నాముందు నిలిచాయి, నాభార్యను తల్చుకొని గర్వించాను. నర్సును తల్చుకొని అసహ్యించుకొన్నాను. ఆ నిమిషంలో మనుషులు పెరిగే వాతావరణానికి, నైతికవిలువకు సంబంధం వుంటుందనే–ఆలోచన నాలో రాలేదు.

ఆమెను అసహ్యించుకొన్నాను. ఆమెతో సౌఖ్యం అనుభవించిన వాళ్ళందరూ నాలానే తల్చుకొని వుండాలి. ఎంచేతంటే మగవాడిలోని అహంభావం, ఆడదాన్ని అనుభవించాక, ఆమెలో తనతల్లిపోలికలు లేవనినిర్ధారించుకోగానే ఆమెపై అసూయగా మారిపోతుంది. మగవాడికి తల్లిసాధారణంగా పవిత్రంగా కనిపిస్తుంది. నాభార్యలో యీపవిత్రత కనిపించగానే నేను చేసిన తప్పులు చెప్పకుండా వుండలేక పోయాను. నర్సుకు నాకూ జరిగిన సంఘటన ఒకనాడు చెప్పాను. ఆమె నన్ను అర్థం చేసుకొందని తృప్తిపడ్డాను.

ఇంతవరకూ నారోజులు బాగా దొర్లిపోయాయని, యిప్పుడే నా రోజులు మంచివికావని, ఆమరుచటి సంవత్సరం సెప్టెంబరు నెలలో అనుకొన్నాను. నా కడుపులో నొప్పి నన్ను రోజుకురోజూ కృంగదీసేది. ఇక్కడ అక్కడ మందులు తిని లాభం లేక, చివరకు ఆసుపత్రిలో చేరాను. ఒకవారం రోజులైన పరీక్షలోపెట్టి ఎక్సురే తీశాక ఆపరేషన్ అవుతుంది. చేరేటప్పటికి అప్పుడప్పుడు బ్రహ్మాండంగా వచ్చే నాబాధ, ఆబాధగురించే తరువాత వచ్చే తలపులుతప్పించి ఒకప్పుడు ఒక నర్సువలన ఒక అపూర్వమైన అనుభూతిని పొందానని తలుచుకో లేకపోయాను.

చేరిననాటి సాయంకాలం నన్ను చూడటానికి నా భార్య వచ్చేసరికి ఐదుగంటలయింది. ఆమె యెల్లప్పుడూ నా దగ్గరేవుంటే, నాబాధ యింత వుధృతంగా వుండదనిపించింది. 'ఆచేసే ఆపరేషన్ని రేపేచేసివేగంగాపంపకూడదూ. అడగండి డాక్టర్ని!' అని కళ్ళల్లో నీరుతో చెప్పింది. 'ఆమె నన్ను విడవలేదు. నేనామెను విడనలేను.' ఆరుగంటలయిపోయింది. అక్కడున్న స్టాఫ్‌నర్సుతో చెప్పగానే నాభార్య కొంతసేపు వుండటానికి అనుమతించింది.

ఏడుగంటల దరిదాపుల్లో రాత్రిపని చెయ్యవలసిన నర్సువచ్చి వచ్చీరావటంతో వార్డువేపు చూస్తూ, ఒక్కగసురు కసిరింది. మాఆవిడ చెదిరిపోతూ 'ఏంటండీ—యీ రాక్షసి!' "అవును రాక్షసే!నువ్వుమాత్రం కదలకండావుండు' అన్నాను. నాభార్య కదలకండా వుండటంతో చప్పున దగ్గరగా వచ్చేస్తూ నాముఖమైనా చూడకండా 'వెళ్ళమ్మా, పల్లెటూరువాళ్లు కాదుగా, మళ్లీ మళ్లీ చెప్పటానికి—వినకపోతే గెంటించటానికి!'

నా మనసు మండిపోయి 'ఏడు గంటలూ దాటాక మీరు అధారిటీ చలాయించండన్నాను.' ఆమె నావైపు యేదో అందామనే చూసి చప్పున నోరు మూసివేసింది. రెండడుగులు ముందుకువేస్తూ అలావచ్చే పగలు పనిచేసిన నర్సుతో 'ఈవేళనేనా యీయనచేరారు?' అంది. అవునన్న ఆమెసమాధానం విని, నావేపుచూసి, 'దయచేసి పంపించి

వెయ్యండి! అన్నీ తెలిసినమీరే రూలుకు వ్యతిరేకంగా నడిస్తే బాగుండదు.'

యింకా నా మనసు మండుక పోవటంతో నేను మౌనాన్నే ప్రదర్శించాను. నామౌనం ఆమెకు చాలా కంటకం కలిగించిందేమో, ఒక క్షణం ఆగి, 'మీరు వెళ్లి తీరాలండీ' అని నాభార్యని హెచ్చరించింది. వార్డులోని రోగులంతా మావేపే చూస్తున్నారు. వరండాలోని వాళ్ళుకూడా లోనికి వచ్చి తొంగిచూస్తూంటే, మా ఆవిడ బయలు దేరి పోయింది.

నాకా నిముషం నుంచి మనసు మనసులాలేదు. నన్ను యీ నర్సు గుర్తించింది. నాభార్య అని పోల్చుకుని, అసహనంతో, ఆమెను పరాభవించేవరకు దానికి తృప్తి కలగలేదు ఇంత రభస చెయ్యటానికి నాభార్య చేసిన తప్పేమీలేదు. నాకంటికి యీమె మరీ అసహ్యంగా కనిపించింది. ఆమెలో ఆరోజు చూసిన అందచందాలు, యీవేళ యెందుకుంటాయ్ జీవితంలో ఒక లక్ష్యమా? నీతా? యిలా హీనంగా బ్రతికి అతీగతీలేక చచ్చిపోవటమే? యీఅరుపులు యీ హేయ భావం, యేమాత్రం ఆమెలో సంస్కారంలేదని నిరూపిస్తుంది ప్రతి నిముషం ఆమెను అసహ్యించుకొంటూంటే పదిగంటలయింది. ఒక్కదీపం తప్పించి వార్డులో దీపాలన్నీ ఆరిపోయాయి. నేను నిద్రపోవాలని ప్రయత్నించలేదు. ప్రయత్నిస్తే నిద్రవస్తుంది. నిద్రపోతే యీమెను అసహ్యించుకోలేను.

నాకడుపులో నొప్పిలేచినా, యిలాంటి నీచ స్త్రీ చేత సేవ చేయించుకోను. ఎంత అవినీతి పరురాలు కాకపోతే ఆరోజు అంత బాహాటంగా నన్ను గదిలోకి తీసుకు పోయింది.

ఒకడు బాధతో గుంజుకుపోయి, నాపక్క బెడ్డుమీద కేకలు పెట్టి యేడుస్తున్నాడు. ఆమెవచ్చింది. నాముఖం రెండో వేపుకు త్రిప్పేశాను. ఆమెమాటలు నాకువినిపిస్తున్నాయి వినకూడదని చెవులు మూసుకున్నాను. హౌసుసర్జనును పిలుచుకు వచ్చింది. కొద్దిసేపటికి వాడు పడుకున్నాడు. ఆప్రక్క వార్డులో ఎవరో తత్వం పాడుకుంటూంటే కమ్మగావుంది. వరండాలో ఒకపదేళ్ళ పల్లెటూరి కుర్రవాడు, వాళ్ళతల్లిదండ్రులను తల్చుకొని, యేడుస్తున్నాడు. నర్సు వచ్చి దగ్గరగా కూర్చుని యెన్నోతియ్యని కబుర్లుచెప్పి ‘తమ్ముడూ! అక్కను నేనున్నానుగా. రేపునీకు కావలసిన వన్నీ నే తెచ్చి పెడ్తాలే” అని ఓదారుస్తోంది. ఎంతో సేపటికిగాని ఆకుర్రవాడు పడుకోలేదు. పడుకున్నా పలవరిస్తోంటే “పాపం!” అనుకుని, నా మంచం దరిదాపుల్లోకి వచ్చింది. నేనునిద్రపోతున్నట్లు నటించాను. నాయెదరగా వున్నపరుపుమీదవున్న ముసలాయన “అమ్మా” అన్నాడు. ఆయన అవసరం గుర్తించి తొట్టి తెచ్చి యిచ్చింది. ఎవడో ఒకడు లేస్తూనేవున్నాడు, ఏదో అవసరం కలుగుతోంది. అవసరంలేకుండావున్న వాణ్ణి నేనే అనిపించింది.

పదకొండు గంటలు దాటిపోయింది. ఆమె రెండుసార్లు

నామంచం దగ్గరకు రావటంతో, ఆమె మనసు అర్థం చేసుకొన్నా ననుకున్నాను. పాపం! నేను పూర్తిగామారిపోయానని—ఆమంటే నాకెటువంటి అభిమానం లేదని—పైగా అసహ్యించుకొంటున్నానని తెలియదేమో!

పంద్రెండు కొట్టింది. ఆమె దగ్గరగా వచ్చి నాముఖంలోముఖంపెట్టి 'నిద్రపోతున్నారా?' అంది. వార్డులో నిశ్శబ్దంగా వుంది. నేను విసుక్కుంటూనే లేచినట్లు లేచాను. 'ఒకసారి దయచేసి వస్తారా?' అంది. నేను యెందుకో రాను అని చెప్పకపోయినా, చాలా ఫీమా చేశాను. ఆమె మళ్ళీ ప్రాధేయపడుతున్నట్లుగా 'కొద్దినిముషాలే - రాగలరనుకుంటాను'—నాభార్యను పరాభవించి నన్ను పరాభవించింద. ఈమెను నే యిప్పుడు పరాభవించొచ్చని వెంటపడ్డాను.

గదిలో యెదరగా కుర్చీ మీద కూర్చోబెట్టింది. ఇద్దరూ తప్పించి యింకెవరూ లేరు. అటువేపు గదిలోవార్డుబోయి—హౌసు సర్జను నిద్రపోతున్నారు. వార్డులో అంతా పడుకున్నారు. లైటు ప్రకాశవంతంగా వుంది. నా ముఖం ముడుచుకొనే వుంచి నా అయిష్టతను వ్యక్తపరిచాను.

కిటికీనుంచి బయటకు చూశాను. ఆకాశంలో నక్షత్రాలు కనుపించాయి. ఏవో మేఘాలుచెరుగుతూ నాయింటివేపు నడుస్తున్నట్లు భ్రమపడ్డాను. నాభార్యజ్ఞాపకంవచ్చింది. నేనిక్కడ ఒంటరిగా ఒక యువ్వని యెదరగా కూర్చున్నానని మరచిపోయాను.

ఇంతసేపు ఆమె నావేపు పరీక్షగా చూస్తోందని, నేననుకోలేదు. 'నాకు గుంటూరు బదిలీ అయింది. యీవూర్లో యీరాత్రి ఆఖరు.' నేను వినిపించుకోనట్లే వున్నాను. 'ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నారు.' అంది. నేనుజవాబుచెప్ప లేదు. 'బహుశః నాగురించే అయ్యుంటుంది' అంది. నాకుచిరా కెత్తింది. 'ఈలోకంలో నేను ఆలోచించేది, ఆనందించేది నాభార్య తప్పించి యింకెవరూకాదు.' ఆమె చిన్ననవ్వుతో నావేపు ఒకసారి చూసి తలదించింది. ఆ చూపు ఆ నవ్వూ ఆడదాని సహజత్వాన్ని నిరూపిస్తున్నా నేను ఆమెను—ఆ కోమలత్వంవున్న ఆడది యీమె కాదని—నిర్ధారించుకోవటం చేత మామూలుగానే వున్నాను.

ఆమె మెల్లగా మాట్లాడుతూంటే, ఏడుగంటలప్పుడు ఆమె గొంతుకలోని కర్కశత్వం యిప్పుడు కొద్దిగా నయినా అగపడలేదు.

'మీరు నన్ను చాలా అసహ్యించుకొని వుంటారు—ఇప్పటికీనీ.'

అవునన్నట్లుగా ఆమె ముఖం వేపు తీక్షణంగా చూశాను. అక్కడనుంచి వేగంగా వెళ్ళిపోదామని నాకుంది.

'చూడండి. మీరు అసహ్యించు కొంటున్నారంటే మీ తప్పేమీ లేదు. నావిధిని నేను సక్రమంగా నిర్వర్తించ వలసి వచ్చేప్పుడు, యెందరి దగ్గర చెడ్డయితే నాకేం! నాలో నాపని సరిగ్గా చేశానని తృప్తివుంటుందిగా!

నా ముఖం కిటికీవేపు తిరిగిపోయింది. ఆమె మళ్ళీ

అన్నది. అయితే నేను నా పనిలో ఒకేసారి అబలనయి పోయాను. అదీ మీదగ్గరే.'

నేనేమీ మాట్లాడలేదు. ఆమె మళ్ళీ చెప్పుక పోతోంది. మాజీవితం ఎలా వుంటుందో ఈరాత్రి మీరు చూశారుగా. కానీ లోకం మాగురించి ఎంత అసహ్యంగా తల్చుకుంటుంది. మేమూ మనుష్యులమే. మాలాంటివయసూ అంద చందాలతో వున్న సంసార స్త్రీలకు వున్న కోరికలూ మాలోనూ ఉంటాయి. మాజీవితంలో సుఖానికి మేం నోచుకోము. మగాళ్లు మేం అవినీతిపరులమనీ మేం వేగంగాలొంగి పోతామని, మమ్మల్ని వెంటాడుతారు. మేం లొంగిపొయ్యామంటే సుఖం అనుభవించి, వాళ్ళెంతో నీతిపరులైనట్లు మా అవినీతి లోకంలో చాటుతారు!'

నాకీ సమర్థన ఎందు కనిపించింది. ఆమె సమర్థించటంవల్ల మళ్ళీ నేను ఆరోజు మనిషిని కానుగా—కాని ఆమె వైపు ఒకసారి చూశాను. ఆమె సజలనేత్రాలతో నావైపు మిటుకుమిటుకుమని చూస్తూ "నాకు వుండేది పెళ్ళి చేసుకోవాలని. పతివ్రితగా వుండి పిల్లలు కనాలనీ, కానీ నాప్రాణం యీపనిలో చేరితేనేకాని, నిలిచే పరిస్థితిలో ఉండేదికాదు. చేరాను. చేరినా ఎంతో కట్టుబాట్లుమీద వుండటానికి ప్రియత్నించాను. నావయసు, అందం, తిండీ, బ్రతుకూ, తెచ్చిన అగ్ని ఏదో నన్ను వెర్రెత్తించేది. ఒక అందమైన డాక్టరుకు ఆయన మాటలునమ్మి లొంగి పోయాను. ఆ

రాత్రింతా నేనొక పాపినై పోయానని వెక్కి వెక్కి యేడ్చాను'

ఆమె కళ్ళవెంబడి అలా నీరు కారటంచూసి నా మనసు ద్రవించి పోలేదు. ఆమె కళ్లు ఒత్తుకుంటూ 'నలు గురినోట్లో పడేటట్లు ఆ డాక్టరే గొప్ప చెప్పుకున్నాడు. దానితో నాలో అగ్ని మరింత రాజుకపోయింది. కొందరు వార్డు బోయిలు నాకు వినిపించీ వినిపించనట్టుగా 'సుందరీ నీ కెందరో' అంటారు. నాహీనమైన బతుక్కి నేను కుమిలి పో తుంటాను. నాలో యీ అగ్నిని అంతా రగిల్చేవారే కాని చల్లార్చేవారెవరూ లేరు.'

ఆమె గొంతుక పట్టుకపోయిందనుకొన్నాను. ఆమె నావేపు చూసేచూపులో నేననుకొన్న కోర్కెలు కనిపించక పోవటంతో నేనామెవేపు చూడకుండా ఉండలేకపోయాను. 'మీరు కనిపించారు. మీలో నాదీ అనేదేదో నాకు కనిపిం చింది. మీమీద ఓమమకారం అదోపిచ్చి నాలో పొంగి పోయింది. ఆఅవకాశంకూడా ఆలాగే దొరికింది. ఇన్నిసార్లు అందరూ సగంకనిపించిన నన్నుచూసి ఆనందించారు. అనుభ వించారు. కాని మిమ్మల్ని చూసినప్పుడేనామనసుపూర్తిగా వికసించిన గులాబీఅయింది. నాజీవితంలో ఒకేసారి— అదే మొదటిసారి—అదే ఆఖరుసారి! ఆవిషయం తరువాత తెలుసు కొన్నా—

ఆమె ఆగిపోయింది. ఆమెలో పట్టలేని ఆనందం ఆ విషయం చెప్పనిచ్చింది కాదని పోల్చుకొన్నాను. నేను నా

చేతులు ముందుకు టేబిలుమీద అప్రయత్నంగాపెట్టి ఆమె కళ్ళలోకి చూస్తూన్నాను. ఆమె చిన్నహాసంతో— 'నన్ను చూసినవాళ్ళందరూ అగ్నిదగ్గర లక్కలా కరిగిపోయారు. కానీ మీలోఎంత నిగ్రహంవుంది! మీలో యెంత సరసత వుంది! వికసించిన గులాబీని మిగతావారిలా నలిపేకుండా— మీ చేతులతో యెంతో ఆప్యాయముగా తాకారే?... జన్మ జన్మాలకీ మరచిపోగలనండీ?— మిమ్మల్ని అంత వున్నతంగా తల్చుకోకండా మ్రొక్కకండా బ్రతకగలనండీ!'

ఆమె అమృతావేశంలో నా దగ్గరగా వచ్చేసింది. ఆమెకళ్ళలో ఆనంద భాష్పాలు రాలిపోతున్నాయి. నాక్కా-వలసినదంతా ఈలోకంలో యీమెదగ్గరే ఉందనిపించింది. నాలోనూ యేదో పొంగు పొరలిపోయి లేచిపోయాను. నేను ఇంకోస్త్రీకి భర్తనని మరిచి—యీమే నాభార్యని—యీమె కోసమే కలలుగని పొందానని—ఈమే నా సర్వస్వమని—ఈమె నే—యీ ఆనందాతిశయంతో— యీ యెడతెగని నాలోని దాహంలో బిగియార కౌగిలించి ముద్దాడి, నాలోఐక్యంచేసుకోవాలని వురకలువేశాను... కానీ... నాలో... యేదో ఒక తెలివి యనిజిజ్ఞాస మేల్కొని...'నేనూ ఒక గులాబీ ముల్లునని— ఉదయాన్నే గులాబీని కప్పేమంచులో నేనూ ఒక బిందువునని—గులాబీ రెక్కలు రాల్చే కాలంలో నేనూ ఒక క్షణమని—నా కామెను ముట్టుకోడానికి అర్హత లేదని' తల దించి మెల్ల మెల్లగా అడుగులు వేసుకొంటూ పరుపుదగ్గరకు వచ్చేశాను. ★